క్లుప్తంగా

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండలంలోని దళితులు, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అసైన్డ్ మెంట్ కమిటీలో పట్టాలు మంజురు చేయాలని భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండలాలలో భూములు సాగులో ఉన్న లబ్ధిదారులతో కలిసి, ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయడం లేదన్నారు. అనంతరం కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్ వి.అన్వేష్ ఉపాధ్యక్షులు, నరసయ్య సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బ్రౌన్'లో విశ్వకర్మ జయంతి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విశ్వకర్మ జయంతి నిర్వహించనున్నట్లు సంస్థ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కంసాలి, వండ్రంగి, శిల్పి, కమ్మరి, కంచరి వృత్తుల వారిని ఆహ్వానించి సత్కరిస్తామని, వారు ఉపయోగించే పనిముట్లను ప్రదర్శనగా ఉంచుతామన్నారు.

రైతాంగ సమస్యలపై చర్చించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో కరువు పరిస్థితులు, రైతాంగ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్‌కు కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో కేవలం 40 శాతం సాగు భూమిలో మాత్రమే విత్తనాలు వేశారని అందులో కూడా అత్యధిక పంటలు ఎండుదశకు వచ్చాయని తెలిపారు. ఉపాధి పనుల ద్వారా అదనంగా వంద రోజులు పని కల్పించాలని, పట్టణాల్లో వలసలు పెరుగుతున్నందున ఉపాధి పనులు పట్టణాల్లో కూడా కల్పించాలన్నారు. కెసి కెనాల్ కాలువకు నీరు ఎప్పటి వరకు అందుతుందో స్పష్టంగా ప్రకటించాలన్నారు.

రక్తదాతలకు సత్కారం



రక్తదాతను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : పలు సందర్భాల్లో రక్తం ఇచ్చి ఆదుకున్న దాతలకు ఖాన్ కా రిస్తా రక్తదాన సేవా సమితి ప్రత్యేకంగా అభినందనలు తెలిపింది. శనివారం కడప నగరం చిలకలబావి వద్దగల ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ నిర్వాహకులు తారిఖ్ అలీని ప్రత్యేకంగా అభినందించారు. ఆయన రక్తదాన కార్యక్రమాలు, రక్త సేకరణ శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్న వారిని ఆదుకుని మానవత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ పక్షాన రక్తదానం చేసిన వారికి ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు మజహర్ అలీఖాన్, డాక్టర్ ఆబిద్, కుళ్లాయప్ప, నాగూర్, సంస్థ సభ్యులు సల్మాన్, శివ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా ఎంపికలు



కడప మండల బాలుర జట్టు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానం, వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా మూడురోజుల పాటు నిర్వహించిన కడప మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికలు ముగిశాయి. శనివారం యోగ, టెన్నికాయిట్ క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి, కడప మండల ఇన్‌చార్జి బి. నిత్యప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి మండల జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను సంరక్షించుకోవాలి



వైవీయూలో ఓజోన్ పొర సంరక్షణ ర్యాలీలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైవీయూలో నిర్వహించిన అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవం ర్యాలీని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఓజోన్ పొరకు దెబ్బ తీసే ఉద్గారాలను తగ్గించే ప్రయత్నం జరగాలని, ఆ దిశగా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ వైవీయూ పరిపాలన భవనం నుంచి సీవీ రామన్ సైన్స్ బ్లాక్ వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ×పర్యావరణం మానవులపై ఓజోన్ ప్రభావం× అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రాజూరి రామకృష్ణారెడ్డి ఓజోన్ స్థితిగతులు, పర్యవసరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యావరణశాఖ సహ ఆచార్యులు డా. టి. చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకటరామిరెడ్డి, పీఓలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఓజోన్‌పొర సంరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా మాట్లాడుతూ ఓజోన్ పొర ఒక గొడుగులా మానవాళిని సంరక్షిస్తోందన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. గురివిరెడ్డి, డా. పి. సుబ్రమణ్యం, అనూరాధ, నాగరత్న, సలీం, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యులు పాకా సురేష్ పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు శనివారం కడప పవన్ కాన్సెప్ట్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాకా సురేష్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఇంజనీరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్లోరో ఫ్లోరో కార్బన్ల వలన ఓజోన్ పొర క్షీణిస్తుందన్నారు. ఫలితంగా చర్మ సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే వాడాలి

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వాడాలని పొదార్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయ మాధవిశర్మ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆ స్కూల్ పిల్లలు కడప నగరంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఏడు రోడ్ల కూడలిలో మానవహారాన్ని నిర్వహించారు.



పర్యావరణంపై సైన్సు అధికారి రచించిన కవితను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

మానవాళి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించాలి

– జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురసస్కరించుకుని జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి రాసిన కవితను శనివారం డీఈఓ రాఘవరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మదిలోకి సైన్సు సంబంధించిన విషయాలను తీసుకువెళ్లడానికి సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పర్యావరణాన్ని కాపాడుకునేటట్లుగా పరిసరాలను అభివృద్ధి పరిచి, మొక్కలను పెంచే బాధ్యతలను తీసుకోవాలని డీఈఓ సూచించారు.

గణపతి మట్టి విగ్రహాలు పంపిణీ



కడప కార్పొరేషన్: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పాకా సురేష్



కడప కల్చరల్ : మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నెమలిదిన్నె నాగవేణి

కడప కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక రాజీవ్ పార్కు వద్ద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాకా సురేష్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలను వాడటం వల్ల భూమి, నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను వాడటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, లక్ష్మినారాయణ, సహాయ పర్యావరణ ఇంజనీర్ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి సంస్థ పక్షాన 500 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలుడు వినాయకుడి వేషధారణతో అలరించడం విశేషం.

– కడప నగరంలోని మున్సిపల్ స్టేడియం వద్దగల విజయ్ ఆర్ట్ ఫౌండేషన్‌లో విద్యార్థులు వినాయకుని విగ్రహాలను మట్టితో తయారు చేశారు. వాటిని ఆరబెట్టిన తర్వాత రంగు రంగుల వస్త్రాలను సేకరించి బొమ్మలకు అనువుగా కత్తిరించి దుస్తులను చక్కగా అలంకరించారు. ఇలా తయారు చేసిన వందలాది విగ్రహాలను వినాయక చవితి సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

వైవీయూ : కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా విచ్చేసి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

మంచి చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పేదలకు మేలు చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కోరారు. శనివారం సాయంత్రం స్థానిక 25 వ డివిజన్‌లోని ఆకులవీధిలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎం. రమాదేవి అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 10.45లక్షలు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఏ. క్రిష్ణయ్య మాట్లాడుతూ తనకు వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.95 లక్షలు లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేశాడు. తమ మేలు కోరే ఈ ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, శివకేశవ, తోటక్రిష్ణ, బండి బాబు, పత్తిరాజేశ్వరి, రామ్మోహన్‌రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, పవర్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని విస్తృతం చేయండి

కమలాపురం : ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని విస్తృతం చేయాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని దేవరాజుపల్లె, పెద్దచెప్పలి గ్రామాల్లో ఉపాధి పథకం కింద సాగు చేసిన మునగ, పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. అనంతరం చదిపిరాళ్ల వద్ద సీఎల్ఆర్‌సీ కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. త్వరిత గతిన నిర్మాణం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలోని ఉపాధి హామీ ద్వారా పంటల పెంపకాన్ని విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేసి, త్వరిత గతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పూరి మేరి అధ్యక్షతన అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే రివ్యూ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్‌బీ, మెడికల్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం మున్సిపాలిటీలో రూ.280 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.20 కోట్లు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో ప్రజలకు కొంత మేరకు ఇబ్బందులు తప్పవన్నారు. అయితే అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేసి జాప్యాన్ని తగ్గించాలన్నారు. మనం మంచి పనులు చేస్తూ ప్రజలతో చీవాట్లు తినడం ఎంత వరకు సబబు అని కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. రూ.300 కోట్ల మేరకు జరిగే పనులన్నీ మూడు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. పనులు చేసే సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఏ సమయంలోనైనా నాకు ఫోన్ చేయవచ్చని, నేను ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి పనులు పూర్తి అయితే కమలాపురం పట్టణం ఒక మోడల్‌గా తయారు అవుతుందన్నారు. శుక్రవారం విజయవాడలో అన్ని శాఖల ప్రిన్సిపాల్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించానని, ఆర్‌ఓబీ, బైపాస్, మున్సిపల్ బిల్డింగ్ తదతర పనులన్నింటికి ఒకటి-రెండు రోజుల్లో క్లియరెన్స్ వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ

కడప కార్పొరేషన్: వినాయక స్వామి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం కడప నగరంలోని మురళీ థియేటర్ ప్రక్కనగల ఎంజాయ్ క్రీమ్ పాయింట్ వద్ద ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఎంజాయ్ ఐస్‌క్రీం రవి, 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విగ్రహాలు పంపిణీ చేస్తామన్నారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

చెన్నూరు : మండలంలో కేసీ కెనాల్ కింద సాగు చేయని పంట పొలాలలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీదేవి కోరారు. శనివారం చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో మినుములు, జొన్నలను ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మండలానికి 25 క్వింటాలు మినుములు, 7 క్వింటాలు జొన్నలు, రైతు భరోసా కేంద్రాలలో ఉన్నాయని ఇవి ప్రభుత్వం ద్వారా రైతులకు 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో మీ దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు పొందాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణం కోసం రైతులు సహకరించాలి

– ఆర్డీఓ జి.శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : నంద్యాల-జమ్మలమడుగు వరకు ఏర్పాటు చేసే జాతీయ రహదారికి రైతులు సహకరించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు కోరారు. శనివారం జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలకు చెందిన భూములు కోల్పోతున్న రైతులతో, జాతీయ రహదారి అధికారులతో కలసి ఆర్డీఓ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్దముడియం మండలంలోని నాగిరెడ్డిపల్లె, గుల్లకుంట గ్రామాలు, జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రాంతాలకు చెందిన రైతుల భూములలో జాతీయ రహదారి వెళుతోందన్నారు. అత్యధికంగా జమ్మలమడుగు మండలంలోని 37.12 సెంట్లు భూమి అవసరం అవుతుందని మొత్తం 174 మంది రైతుల భూముల్లో ఈ రహదారిపోతుందన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎస్.ఉప్పలపాడు గ్రామ రైతులకు రూ.12.51 లక్షలు, మోరగుడి రైతులకు రూ.16 లక్షలు, జమ్మలమడుగు కన్నెలూరు రైతులకు ఎకరాకు రూ.24 లక్షల పరిహారం ఇవ్వడంకోసం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాబట్టి రైతులు తమకు సంబంధించిన ఏమైన ఇబ్బందులు ఉంటే తమకు తెలియపరచాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణం జరిగితే భూములకు మంచి ధర పలికే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణం కోసం సంబంధించిన భూసర్వే పూర్తిచేసి గెజిట్ విడుదల చేశామన్నారు. రైతులు వీలైనంత త్వరగా సమ్మతిని తెలియజేస్తే జాతీయ రహదారి పనులు వేగవంతం అవుతాయన్నారు. ఏఈ సురేంద్రారెడ్డి, తహసీల్దార్‌లు సి.గురప్ప, జ్యోతి, డీటీ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న రెయిలింగ్ తొలగింపు



నాడు ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్



నేడు రెయిలింగ్ తొలగించిన దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రింగు రోడ్డులో పాలెం పల్లె బ్రిడ్జి వద్ద నేషనల్ హైవే వారు నిర్మించిన రెయిలింగ్ ఊడిపోయి రోడ్డుపై పడిపోయింది. ఆ మార్గంలో వెళ్తున్న వాహనాలకు ఇది తగిలితే మరింత ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 10వ తేదీ సాక్షి దినపత్రిక వార్త రూపంలో ఆ విషయాన్ని హెచ్చరించింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ ఇనుప రెయిలింగ్‌ను తొలగించారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

కమలాపురం : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆదివారం తిప్పలూరులోని ఏకేఆర్ కల్యాణ మండపంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని, మండలంలోని వలంటీర్లు, గృహ సారథులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టండి

కమలాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది చేస్తున్న ఇంటింటీ సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉమామహేశ్వర్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని దేవరాజుపల్లెలో జరుగుతున్న ఇంటింటీ సర్వేను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఏ ఇంట్లో ఏ వ్యాధిగ్రస్తులు ఉన్నారో నోట్ చేసుకోవాలని అలాగే ఈనెల 29వ తేదీ వరకు సర్వే చేయాలన్నారు. 30వ తేదీన సచివాలయాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందితో ఆరా తీశారు. కార్యక్రమంలో మెడికల్ జ్ఞాన ప్రసూన, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-రాజంపేట మార్గంలో ప్రయాణించిన ఆర్టీసీ ప్రయాణికులను ప్రోత్సహిస్తూ ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా శనివారం లక్కీ డిప్ ద్వారా విజేతలను ప్రకటించామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి ఓబులయ్య, రెండవ బహుమతి కృష్ణయ్య, మూడవ బహుమతి రాజేష్ అనే ప్రయాణికులకు లభించాయన్నారు. వీరికి ఆదివారం ఉదయం 11 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందజేయనున్నామన్నారు.

తొలగింపు ప్రచారం అవాస్తవం



ఐక్యతను చాటుతున్న బీసీ సంఘం నేతలు

కడప రూరల్: తమను తొలగించినట్లుగా జరుగుతున్న ప్రచారం అవాస్తవమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘంలో కొన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ అందరం సమిష్టిగా ఉంటూనే నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. మా మధ్య ఎవరిపైనా ఎలాంటి వ్యక్తిగత బేధాభిప్రాయాలు లేవన్నారు. తామంతా బీసీల అభ్యున్నతికి పాటు పడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగించండి



కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీ, జర్నలిస్టు కాలనీల్లో రోడ్ల వెంట కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కేవలం మట్టి రోడ్లు ఉన్న ఈ ప్రాంతంలో ఖాళీ జాగాల్లో, రోడ్ల వెంట ఈ కంపచెట్లు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. ఫలితంగా విషపురుగులు కూడా తిరుగుతున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. జర్నలిస్టు కాలనీలో వాటర్‌ప్లాంట్ రోడ్‌లో పాత ఫ్యాక్టరీ ఆవరణంలో కంపచెట్లు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక సహాయం



శివస్పందనకు చెక్‌ను అందజేస్తున్న గోద్రెజ్ డిస్ట్రిబ్యూటర్‌లు

కడప రూరల్: కడప గోద్రెజ్ డిస్ట్రిబ్యూటర్ సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న ఆరిఫ్ అహ్మద్ జులై 15వ తేదీన కడప నగరంలోని బళ్లారి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు భార్య మారెళ్ల శివస్పందన, తొమ్మిది నెలల ఒక కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. ఈ చెక్‌ను శనివారం స్థానిక ఆ కంపెనీ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటర్స్ గుండా వేణుగోపాల్, నరసింహ, పవన్‌కుమార్‌లు మృతుడు ఆరిఫ్ అహ్మద్ భార్య మారెళ్ల శివస్పందనకు అందజేశారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమ్మనాన్న వృద్ధాశ్రమానికి చెందిన పాలాది సంజమ్మ అనే వృద్ధురాలు, జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పి.శ్రీను(40) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవరు లేకపోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు సమాచారం అందించారు. ఆయన తమ ఫౌండేషన్ సభ్యులతో కలసి వారి మృతదేహాలకు శనివారం హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కృప అగ్ని షారూన్ ట్రస్టు చైర్మన్ పాపిశెట్టి వెంకటలక్షుమ్మ, కె.సుమన్ బాబు, భార్గవ్ సాయి, సుబహాన్, తిరుపాల్, విజయ్ పాల్గొన్నారు.

